విషకౌగిలి

సికిందర్

(గత సంచిక తరువాయి)

ఆమె తలుపు దగ్గరాగి హాండిల్ మీద చెయ్యి వేసింది. కుడిచేతిలో రివాల్వర్ ట్రిగ్గర్ మీద వేలువుంచి సిద్ధంగా పట్టుకుంది.

దబదబ మోగిపోతోంటే తలుపు — ఆమె అతి నెమ్మదిగా, తాపీగా హాండిల్ని తిప్పి పక్కకు తప్పుకుంది.

ఒక్కసారిగా తెరచుకున్న తలుపులోంచి లాల్ జొరబడ్డాడు, అతని వెనుక మరికొందరూ.

అందర్నీ నిశ్చేష్టుల్ని చేస్తూ ఫ్రేలిందామె చేతిలో రివాల్వర్, సీలింగ్ లోకి. ఒక్క గొంతు బయటికి వేసి, చెదిరిపోయి హాహాకారాలతో వురుకుతున్న జనంలోంచి పరుగెత్తింది.

ఆమె మెట్లు దగ్గరికి చేరుకుంటూండగానే లాల్ బయటకొచ్చి రివాల్వర్ తీశాడు. తనని తరుముకొస్తున్న అతన్ని చూసి మళ్ళీ ఫ్రేల్చిందామె. బుల్లెట్ కారిడార్లో బల్బుని తునకలు చేసింది. అంధకారం వ్యాపించింది. ఆర్తనాదాలు మిన్నుముట్టాయి.

లాల్ మరింత వేగంతో ముందుకెళ్ళాడు. మెట్లు

చేరుకుంటూండగానే, కిందికి దిగిపోతున్న ఆమె మళ్ళీ పేల్చింది. బుల్లెట్ వచ్చి లాల్ కింద మెట్టుకు తగిలింది. అతను ఎగిరి వెనక్కి దూకి మళ్ళీ ముందుకు దౌడుతీశాడు.

ఆమె గబగబా మెట్లు దిగిపోసాగింది .... దిగుతూ రెండో అంతస్తులో కాలుజారి దొర్లుకుంటూ పోయింది.

పైకి రివాల్వర్ పేల్చి లాల్, ఆమెని ఆగి పొమ్మంటూ హెచ్చరించాడు. కానీ అతను చేరుకునే లోపునే ఆమె లేచి తిరిగి వురికింది. క్షణాల్లో ఆమె బయట ఆవరణలో పరుగెత్తసాగింది....

అప్పుడు లాల్ చివరి మెట్టుమీద ఆగి గురిచూశాడు. ఆమె వేగంగా గేటును సమీపిస్తోంది. పెద్ద చప్పుడు చేస్తూ లాల్ చేతిలో రివాల్వర్ పేలింది.

ఆమె రెండడుగులు గాల్లోకి లేచి పడింది కుడికాలు పట్టుకుంటూ. నిప్పులు కురుస్తున్న కళ్ళతో లాల్ వైపు చూసి షూట్ చేసింది.

లాల్ మెట్లు దిగిపోయి పరుగెత్తుకొన్నవాడల్లా పక్కకు గెంతేసి, మళ్ళీ పలాయనం చిత్తగిస్తున్న ఆమె కేసి షూట్ చేశాడు. ఈసారి ఆమె చేతులు పైకి లేచాయి. రివాల్వర్ ఎగిరిపడింది దూరంగా. ఆమె వీపు పట్టుకుంటూ తూలి ముందుకు పడిపోయింది — గేటు దగ్గర. ఆమె వీపులోంచి రక్తం చిమ్మసాగింది....

లాల్ పరుగెత్తాడు. వెనుక జనం పరుగెత్తుకొచ్చారు. రోడ్డుమీద పోతున్నవాళ్ళూ వచ్చారు. ఒక్కసారి ఆ ప్రాంతం కల్లోలితమైంది ...

జనాన్ని తోసుకుంటూ లాల్ ఆమెని చేరుకున్నాడు. గేటు దగ్గర లైటు వెలుగు ఆమెపై బాగా పడుతోంది. ఆ వెలుగులో ఆమె చీరంతా రక్తంతో తడిసి కని

స్తోంది. ఆమె అలాగే బోర్లా పడుకుని వుంది. ఆమె చేతులు, కాళ్ళు చిన్నగా కదుల్తున్నాయి.

ఆమె పక్కన కూర్చుని లాల్ వెల్లకిలా తిప్పాడు. మూతపడుతున్న కళ్ళతో ఆమె చుట్టూ మూగినవాళ్ళని చూసి ఏదో గొణిగింది. ఆమెని చూసిన వాళ్ళంతో ఒక్కసారి అరిచారు. "సుహాసిని! సుహాసిని!"

ఆమె చేతులు ముఖంమీదికి కదుల్తున్నాయి. ఆమెని లాల్ మౌనంగా గమనిస్తున్నాడు. ఆమె చేతులు ఒక్కసారి ముఖంమీద పొరని లాగేశాయి-మాస్క్‌ని!

జనంలోంచి మరోసారి అరుపులు, కలకలం. "కాదు! ఈమె సుహాసిని కాదు! సుహాసినికాదు!"

లాల్ తికమకగా చూశాడామెని. ఆమె అసలు రూపం అతని కళ్ళకింకా ఆనడంలేదు. మాస్క్‌ని పట్టుకుని పరిశీలించాడు. ఆమె భుజాలు పట్టి వూపుతూ, "ఎవరు-నువ్వెవరు?" అన్నాడు.

ఆమె తల అడ్డంగా వూపింది, "నేను సుహాసినిని కాదు. ఆమె రూపంలో తిరుగుతున్నాను. వాళ్ళు చెప్పిన హత్యలు చేస్తున్నాను. ఈ హత్యలన్నీ చేసింది నేనే! సుహాసిని కాదు! ఇలా చేస్తే నాకు చాలా డబ్బిస్తుందన్నాడు బాలరాజ్ .... కానీ అతను చచ్చిపోయాడు! ఇప్పుడు నేనూ చచ్చిపోతున్నాను.... నేనూ చచ్చిపోతాను.... నేనూ...."

ఆమె చేతులకి గ్లవ్స్‌ని చూస్తున్నాడు లాల్, "నా సందేహాలు ఇప్పుడు తీరుతున్నాయి. అందుకే సతీష్‌ని నిర్దాక్షిణ్యంగా చంపేశావు. నన్ను బందీగా వున్నప్పుడు కల్సుకున్నప్పుడు సుహాసిని కన్నవాళ్ళ గురించి నిర్లక్ష్యంగా మాట్లాడావు. నువ్వు శత్రుపక్షమే అయినప్పుడు

నీకు వాళ్ళమీద పగ ఎలా వుంటుంది!"

ఆమె మాట్లాడలేదు. అతి కష్టంగా ఊపిరి తీసుకుం టోంది.

"ఓహ్, మీ గ్యాంగ్ ఆశయానికి సుహాసిని ఫిగ్ లీఫ్ అనుకున్నాను. కానీ సుహాసినికే నువ్వు ఫిగ్ లీఫ్‌వి! ఇప్పుడెక్కడుండి సుహాసిని? బ్రతికే వుందా?"

"బ్రతికే వుంది...."

మూసుకున్న కళ్ళతో, ఊపిరందక ఆయాసపడుతూ చెప్పసాగిందామె....

దేవయాని.

• • •

సుహాసిని నిప్పుకణికల్లా మండుతున్న కళ్ళతో చూస్తోంది—

ఆ కళ్ళల్లో వున్న భావం ఒక్కటే—కసి, ప్రతీకారం, కక్ష.

ఏదో చేయాలన్న తపన, తాపత్రయం.

అలసి, వడలిపోయిన ముఖంతో, అవిరామంగా పిడికిళ్ళు బిగుసుకుంటున్న చేతుల్తో ఆ మంచంమీద అశాంతిగా కదుల్తోందామె.

ఆమె కళ్ళముందు ఇంకా ఆ కాళరాత్రి మెదుల్తూనే వుంది—ఆ మూడు కుక్కలు కబళించిన రాత్రి. ఆ క్షణంలో ఆమెకు వళ్ళు జలదరింపు. మనసు ఆక్రందన భస్మీపటలమైన భవిష్యత్తుకు భరించలేని ఆవేదన. కానీ కుప్పకూలించిన ఆమె కళ్ళు కన్నీళ్ళని స్రవించడంలేదు....

ఆ మరుక్షణం ఆమెకు అంతులేని తృప్తి. ప్రశాంతి. ఆ మూడు కుక్కల వధింపుకు వర్ణించలేని వివశత్వం.

కానీ—

ఆమె కళ్ళముందు తండ్రి చితిమంటలు ఇంకా ప్రజ్వరిల్లుతూనే వున్నాయి!

తల్లి మరణవార్త చెవుల్లో మారు మోగుతూనే వుంది!

నరేన్ ఛిద్రమైన శరీరం హృదయాన్ని తూట్లు పొడుస్తూనే వుంది!

ఇంకా —

తన పేరుమీద జరుగుతున్న మారణ కాండ తెలుస్తూనే వుంది!

తనకేం జరుగుతున్నదో బోధపడుతూనే వుంది!

అప్పుడు ఆత్మ ఘోషిస్తూనే వుంది — సహించకు. నీవాళ్ళకు జరిగిన అన్యాయాన్ని సహించకు. అంతాన్ని చూస్తూ తెచ్చుకోకు. పూనుకో! ఇప్పుడే, ఈ క్షణాన తెగించి నీచేతనయినంతవరకు చెయ్. ఒక్కొక్కర్ని చీల్చి చెండాడు.

కానీ ఇన్ని రోజుల ఖైదులో ఆమె నిస్సహాయురాలే అయింది. మనసు ఎంత ఘోషపెడుతున్నా నిరాశా నిస్పృహాలు కలుగుతూనే వున్నాయి. ఇందులోంచి బయటపడే మార్గం కన్పించడంలేదు.

నిట్టూరుస్తూ ఆమె మంచం దిగింది. నీరసమైన శరీరాన్ని అడుగులో అడుగు వేసుకుంటూ తలుపు దగ్గరికి చేర్చింది....

బయట ఆమెకు లయబద్ధంగా అడుగులు విన్పించాయి. ఇంకే శబ్దమూ లేదు.

* * *

ఆ పక్క గదిలోనే జాన్ పరిస్థితి సరిగ్గా ఇలాగే వుంది.

మంచంమీద పొర్లుతూ, పొలమారి దగ్గుతూ, దిగ్గున లేచి కూర్చుంటూ, గదిలో తిరుగుతూ అశాంతిగా గడుపుతున్నాడు.

అతడాశించిన వాతావరణమే సిద్ధమయింది. ఇంట్లో చాలావరకు మనుషులు వెళ్ళిపోయారు. బయట యెవరో కాపలా వున్నారు. వున్నాడా? ఒకడా? ఇద్దరా? ఈ సందేహంతోనే అవకాశం తీసుకోవడానికి వెనుకాడుతున్నాడు జాన్. ఒక్కడైతే ఎదుర్కోవడం కష్టం గాదు. ఇద్దరయితే ప్రాణాలతో రిస్కు వుంటుంది.

జాన్ మళ్ళీ తలుపు దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

బయట అడుగులే కానీ మాటలు లేవు.

శ్రద్ధగా విన్నాడు. ఆ అడుగులు ఒక్కడివే.

అప్పుడు నిర్ణయానికొచ్చాడు తెగింపుతో.

గాఢంగా ఊపిరి పీల్చుకుని, తలుపుమీద కొట్టాడు చిన్నగా.

వెంటనే బయట అడుగులాగిపోయాయి.

జాన్ మళ్ళీ కొట్టాడు.

అడుగులు దగ్గరకొచ్చి ఆగాయి.

"ఎవరక్కడ? కొంచెం తలుపుతీయ్...." అన్నాడు మళ్ళీ కొడుతూ.

"దేనికి?" అవతలనుంచి మాటలు విన్పించాయి.

"నేను అర్జంటుగా బాత్ రూం కెళ్ళాలి."

వెంటనే వచ్చింది జవాబు. "కుదరదు, మావాళ్ళు రావాలి."

"అంతదాకా ఆగలేను. బ్లాడర్ నిండిపోయి ప్రాణం తీస్తోంది. వెంటనే బాత్ రూం కెళ్ళిపోవాలి. లేకపోతే గది ఖరాబవుతుంది...."

"ఎత్తులు వేయకు మిస్టర్!"

"నాకంత సహనంలేదు! బాత్ రూంకెళ్ళే తొందర్లో వున్నాను—ముందు బ్లాడర్ ఖాళీ అయితేగానీ మనసు నిలకడ కాదు. నీకంత అనుమానముంటే బాత్ రూంలో కెళ్ళగానే తాళం వేసేయ్. అక్కడే వుంటాను, మీ వాళ్ళు వచ్చేవరకు. ప్లీజ్, ఆలస్యం చేయకు...."

కొన్ని క్షణాల్లో నిశ్శబ్దం.

"సరే, తీస్తాను. కానీ నా దగ్గర రివాల్వర్ వుందని మరువకు."

తాళం తీస్తున్న చప్పుడవుతూంటే జాన్ వేగంగా కదిలి మంచం పక్కనున్న స్టీలు ఫోల్డింగ్ ఛెయిర్ని పట్టుకుని తలుపుపక్కకొచ్చాడు. ఆదేక్షణంలో తలుపు బార్లా తెరచుకుంది. బయటి వెలుగు కొంత లోపలికి పడింది. వెంటనే అతను లోపలికి రాలేదు, తొంగి చూడలేదు.

హాలు మధ్యకి వెళ్ళి నిలబడి రివాల్వర్ గురిపెట్టాడు.

"చేతులెత్తిపట్టుకుని బయటికిరా, ఆ చీకట్లోంచి!" అన్నాడతను.

జాన్ ఒక్కక్షణం తటపటాయించాడు.

"నా మాటలు విన్నారా?"

"విన్నాను. వస్తున్నాను."

ఛెయిర్ని తన కడ్డంగా పట్టుకుని ఒక్క పరుగుతీశాడు జాన్ బయటికి.

ఏం జరుగుతుందో ఆ మనిషి గ్రహించేలోపున జాన్ వెళ్ళి ఢీ కొట్టేశాడు ఛెయిర్తో. ఇద్దరూ వెళ్ళి వెనుక సోఫామీద పడ్డారు. ఆ మనిషి రివాల్వర్ ప్రేల్చలేక పోయాడు. జాన్ చెయిర్ ఎత్తి బాదగానే తల పక్కకు

వాల్చేశాడు. రివాల్వర్ వదిలేశాడు. జాన్ అతనిమీద నుంచి లేచిపోయాడు.

ఆయాసం తీర్చుకుంటూనే రివాల్వర్ అందుకుని చుట్టూ చూశాడు. ఆ అలికిడికి యెవరూ రాలేదు. ఎక్కడా శబ్దం లేదు.

ఆ మనిషిని లాక్కెళ్ళి ఆ గదిలోనే పడేశాడు. మంచంమీద దుప్పటిని పీలికలుగా చించి కట్టేశాడు. అప్పుడు విసురుగా వచ్చి తలుపు తాళానికి వేలాడుతున్న కీ బంచ్‌ని తీసుకున్నాడు. గబగబా పక్క గది దగ్గరికెళ్ళి దాని తాళం తెరిచేశాడు.

ఈ అలికిడి విని సుహాసిని దిగ్గున లేచి వచ్చింది. తలుపు తెరుచుకోగానే అమాంతంగా లంఘించింది జాన్ మీదికి, ఆడపులిలా. అది వూహించని జాన్ ఆమెతో సహా వెళ్ళి పడ్డాడు అయిదడుగుల దూరంలో. తల నేలకి కొట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు, రివాల్వర్ వదిలేస్తూ. ఆమె రెచ్చిపోతూ అతన్ని రక్కసాగింది.

జాన్ తేరుకుని ఆమెని నెట్టేస్తూ అరిచాడు. "అరె, నేను శత్రువుని కాను! నిన్ను విడిపిస్తున్నాను!"

కానీ ఆమె వినిపించుకోలేదు.

రివాల్వర్ అందుకుంది. పళ్ళు బిగబట్టి దాన్ని జాన్ తలకానించి ట్రిగ్గర్ లాగబోయింది.

జాన్ ఆమె చెయ్యి పట్టుకుని మెలితిప్పేస్తూ రెండో చేత్తో మొహంమీద కొట్టాడు. ఆమె రివాల్వర్ వదిలేసింది. మొహం పట్టుకుని అరవబోయింది. జాన్ లేచి అరవనీయలేదు. నోరు నొక్కిపెడుతూ, రివాల్వర్ అందుకుని తల వెనుక దెబ్బవేశాడు. కళ్ళు తేలవేసింది. మరో దెబ్బవేశాడు. తల వాల్చేసింది. దుబ్బుమని కింద

పడింది.

జాన్ వేగంగా ఊపిరి పీలుస్తూ నిలబడ్డాడు. ఆమెని కొన్ని క్షణాలు చూసి, అక్కడ్నించి పరుగుతీశాడు.

వేగంగా కింది గదులన్నీ చూసి, మేడమీదికి దారి తీశాడు. పైన మెట్లకెదురుగా వున్న గది దగ్గర జాగ్రత్త పడుతూ ఆగిపోయాడు.

ఆ గదిలో లైటు వెలుగుతోంది. ఫ్యాను తిరుగుతోంది కానీ ఎవరూ లేరు. అతను మరొక అడుగువేసి లోపలికి ఇరువైపులా తొంగి చూశాడు. ఎవరూ కన్పించ లేదు. నిశ్శబ్దంగా వుంది. అతను కళ్ళు చిట్లిస్తూ వెనక్కి తిరగబోయాడు—

వెనకనుంచి మెడకు ఒక చల్లటి వస్తువు తగిలింది.

జాన్ స్తంభించిపోతూ చేతులు పైకెత్తాడు.

"గుడ్, ఆ రివాల్వర్‌ని పడెయ్యి!" అంది వెనుక గొంతు.

జాన్ రివాల్వర్ వదిలేశాడు.

అప్పుడతను విసురుగా వెళ్ళి, ధడాలున ఎదురుగా కుర్చీలో పడ్డాడు.

• • •

అతన్ని నెట్టిన మనిషి నవ్వుతూ లోపలికి అడుగుపెట్టి, కిందపడ్డ జాన్ రివాల్వర్‌ని కాలితో తలుపవతలకి తోసేశాడు.

జాన్ అతన్నే చూడసాగాడు, కళ్ళు పెద్దవిగా చేస్తూ.

మరో నవ్వు నవ్వి, యశ్వంత్‌రావ్ గయెక్వాడ్ నాలుగడుగులు ముందుకేసి నిల్చున్నాడు. అతని చేతిలో రివాల్వర్ జాన్‌కి గురిపెట్టి వుంది.

జాన్ అతన్నే గమనిస్తున్నాడు.

"అయితే నువ్వు బయటపడ్డా నన్నమాట?" అడిగాడతను.

జాన్ తలూపాడు అవునన్నట్లు.

యశ్వంత్ ఫెళ్ళున నవ్వాడు, జాన్ అదిరిపడేలా. "కల్ల! బయటపడడం కల్ల! నీవల్ల కాని పనికి పూనుకోవద్దు, మిస్టర్ జాన్. కమాన్, నిన్నా గదిలో వదిలిపెడతాను. నేను పంపించినప్పుడే నువ్వు పోవాలి...."

జాన్ అడ్డంగా తలూపాడు.

"కమాన్, బెట్టు చెయ్యకు! మరొక్క రోజు! ఆ తర్వాత నీ దారి నీది, మా దారి మాది!"

జాన్ మళ్ళీ తల అడ్డంగా వూపాడు.

"మిస్టర్ జాన్, అనవసరంగా మమ్మల్ని కష్టనష్టాలకు గురిచెయ్యకు. నువ్విక్కడ్నించి బయటపడితే మేము తక్షణం ఇల్లు ఖాళీచేయాల్సి వుంటుంది. మాకెక్కడ దొరుకుతుంది ఈ అర్ధరాత్రి తలదాచుకునే చోటు? ఈ ఒక్క రాత్రి ఇక్కడే వుండిపో...."

"నేను వుండను, నువ్వేం చేస్తావు?"

యశ్వంత్ కోపంగా చూశాడు. "జాన్, నన్ను రెచ్చగొట్టకు. నేను మనిషిని కాను. నా గురించి నీకు తెలియదు. మంచిగా చెప్తున్నాను, నువ్వు తిరిగి ఆ గదిలో కెళ్ళిపో!"

జాన్ నవ్వాడు. "ఎందుకు? నాకీ గది బాగానే వుంది. ఇక్కడే వుంచి తలుపు మూయ్!"

"నో!" అరిచాడతను, "నో! నాకు మెదదుంది, మిస్టర్ జాన్! నువ్వా కిటికీలోంచి తప్పించుకుంటావ్!"

జాన్ వినోదంగా చూశాడతన్ని. "ఓహ్, నిజంగా నాకీ ఆలోచన రాలేదు. అయితే నువ్విలాగే కాపలా

కాయ్ నన్ను."

"నా సహనాన్ని పరీక్షించకు!"

"అయితే షూట్ చేయ్?"

"షూట్ — షూట్—" యశ్వంత్ చేతిలో రివాల్వర్ వణికింది.

జాన్ మళ్ళీ నవ్వాడు. "షూట్ చేయలేవు, అవునా? యూ హేవ్ నో గట్స్! మీరింతవరకూ రివాల్వర్ ప్రేల్చే అవసరం రాకుండా గడుపుకొచ్చారిక్కడ! సైలెన్సర్ లేదు. ఒక్క షాట్ పేలిస్తే ఏమవుతుందో నీకు తెలుసు. చుట్టుపక్కల జనం మేల్కొని పచ్చడి చేస్తారు నిన్ను — కమాన్, నీకు ధైర్యముంటే నన్ను షూట్ చేసి పారిపో! ఇంతకంటే మార్గంలేదు నీకు!"

యశ్వంత్ కళ్ళు చిట్లించసాగాడు. అతని నుదురు చెమట పట్టసాగింది. చేతిలో రివాల్వర్ వణుకుతూనే వుంది. జాన్ మాటలు అర్థంచేసుకుని తేరుకున్నాడు.

"నో, నో, నిన్ను నేను షూట్ చేయను. ఆ అవసరం రాదు. కాస్సేపట్లో మా వాళ్ళంతా వచ్చేస్తారు. వాళ్ళే నిన్ను హాండిల్ చేస్తారు.... ఈ కాస్సేపూ నిన్ను కదలకుండా చూడగలను."

"చూడలేవు—" అన్నాడు జాన్, "నే నిప్పుడు నీ మీదికొస్తున్నాను. నువ్వు ట్రిగ్గర్ లాగేస్తావు. కానీ నే నెలా తప్పించుకుంటానో నవ్వూహించవు. ఆ తర్వాత నీ తొందరపాటుకి జీవితాంతం చింతిస్తావు?"

"కదలకు —కదలకు నువ్వు!" అరిచాడు యశ్వంత్ ఒక్క అడుగు ముందుకేసి, "నేను చంపదల్చుకుంటే నువ్వు తప్పించుకోలేవు! కానీ నిన్ను చంపడం నాకిష్టం లేదు. నా జీవితంలో ఇంతవరకు ఎవర్నీ చంపలేదు!"

"అవును, నీ పిరికితనం తెలుస్తూనే వుంది" అన్నాడు జాన్, "నువ్వు నీ చేతుల్తో చంపలేవు. చంపిస్తున్నావు నీ తొత్తుల్తో. నా పక్క గదిలో సుహాసినిని బంధించి, ఆమె వేషంలో మరొకత్తితో చేయిస్తున్నావీ హత్యలు. ప్రజలంతా సుహాసినిగానే నమ్ముతున్నారు. వాళ్ళని పెడదారి పట్టించి పెట్టెలకొద్దీ డబ్బు గడిస్తున్నావు. కరపత్రాల్లో నువ్వు చాటుకున్న ఆదర్శాలన్నీ హంబక్. నీలాంటి శాడిస్టుకి ఆదర్శాలుంటాయని ఎవరంటారు? మర్డర్స్ ఫర్ ప్లెజర్. అంతే. ఆనందంకోసం హత్యలు చేయిస్తున్నావు. యూ ఆరే మోన్ హ్యూమన్ క్రీచర్!"

అంతవరకూ వున్న ఉద్రేకమంతా సడలిపోయింది యశ్వంత్ ముఖంలో. అతను తేలికపడుతూ గర్వంగా నవ్వాడు.

"అవును, జాన్. నువ్వు చెప్పింది నిజం. నా మైండ్ ని సరిగ్గా అర్థంచేసుకున్నావు. కేవలం నా తృప్తికోసమే ఈ హత్యలు చేయిస్తున్నాను. భుక్తికోసం డబ్బు గడిస్తున్నాను. చూశావా, ఒకే దెబ్బకి రెండు పిట్టలు. ఆలోచన అంటే ఇలా వుండాలి. నాది ఇన్ ఫీరియారిటీ అను, నన్ను ఇంట్రోవర్టు అను, పిరికివాడు అను—అన్నీ ఒప్పుకుంటాను. అలాంటి నేను నా అశక్తతను పారద్రోలటానికే శాడిస్టునయ్యాను. నాలో అహం నిద్రలేచింది. శక్తిని నిరూపించుకోమంది. క్షుద్రమైన ఆలోచనల్ని కల్పించింది.... ఇంకేం చేయను?

ఇంకేం చేయాలి, జాన్? నా స్కోర్ బోర్డులో

ఒక్కో చావు పెరుగుతూంటే చెప్పమంటావా నాకెంత గర్వమో! ఇన్ని హత్యలు చేయించిన ఖ్యాతి ఇటీవల కాలంలో నాకే దక్కుతుందని చెప్పమంటావా ఢంకా బజాయించి!

"నా కెదురులేదు. నాకే బెదురూ లేదు! నేను పకడ్బందీగా సృష్టించి అమలుజరుపుతున్న ప్లాను విజయవంత మవుతోంది! సుహాసినిని ఎందుకు బంధించి వుంచానని అడుగు. ఆమెచేతనే ఎందుకు చంపించకూడదని అడుగు. అది చాలా పొరపాటవుతుంది, జాన్. ఆమె కోసం ప్రయత్నంలో ఆమె వాళ్ళని చంపవలసి వచ్చినందుకు కాదు. అసలు ముందే ఆమెతో హత్యలు చేయించే ఆలోచనలేదు. నా ప్లానుకోసం గాలిస్తున్న అమ్మాయితో అలాటి ఆలోచనే లేదు. ఎంతయినా ఆమె మా మనిషి కాదు. మా మాట వింటుందని నమ్మకం లేదు. ఆమెమీద ఆధారపడలేం. కేవలం మా కలాపాలకి ఆమెను డమ్మీగా ఉపయోగించుకోవా లనుకున్నాను, అంతే.

"అంతే, జాన్ అంతే. ఔరంగాబాద్ రైతుబిడ్డ ఎంత ఔన్నత్యాన్ని సాధించాడు! ఈ డబ్బు! ఇన్ని చావులు! ఇవన్నీ నాకు క్రెడిట్స్! ఇంకొక్క రోజు—రేపొక్క రోజుతో యిక్కడ నా ఆపరేషన్ అయిపోతుంది. అప్పుడు నే నేం చేయబోతానో చెప్పను! ఎక్కడికి కెళ్తానో చెప్పను! కానీ ఒక్కటి మాత్రం చెప్తాను: నిన్ను సజీవంగా విడిచిపెట్టేస్తాను. సుహాసినిని—ఆమె విషయంలో నేను చేయగల్గిందేమీ లేదు. దట్ గాడ్—ఆ దేవుడు ఆమెను నిర్మూలించమంటున్నాడు నా సేఫ్టీ కోసం. దేవయాని ఆమెలా చలామణీ అవుతుంది అంతటా!"

యశ్వంత్ గర్వంగా చూసి, రివాల్వర్ని పూర్తిగా మరింత ముందుకొచ్చాడు: "కాబట్టి జాన్, నా మాట విని నీ గది కెళ్ళిపో! లేకపోతే మా వాళ్ళు నిన్నేదైనా చేయవచ్చు. శంభూనాథ్ ఇలాటి పరిస్థితిలో విచక్షణ కోల్పోతాడు...."

జాన్ అతని కాళ్ళ సందులోంచి తలుపవతల రివాల్వర్ కోసం చూశాడు.

అది కన్పించలేదు.

అదే క్షణంలో బయట ఆ బంగళావు చేరువగా వచ్చి ఆగాయి కొన్ని పోలీసు వాహనాలు.

జాన్ తలెత్తి యశ్వంత్ని చూశాడు. ఇప్పుడతని ముఖం క్రూరంగా వుంది. అతనింకొక్క క్షణం సహించేలా లేదు.

జాన్ వెంటనే అన్నాడు: "నీ వాళ్ళు వస్తారంటావా? నాకు నమ్మకం లేదు."

"ఎందుకు లేదు?"

నవ్వాడు జాన్, "వాళ్ళు వెళ్ళి చాలా సేపయింది— నాలుగు గంటలు దాటింది. నిన్న గంటలో తిరిగి వచ్చేశారు. ఇవ్వాళ కూడా నువ్వు పోలేదు. దేనికో భయపడి వుంటావు. నీ భయం వాళ్ళ కవకాశం యిచ్చింది.. అంత డబ్బుతో వాళ్ళనెలా నమ్ముతావు నువ్వు?"

"అంటే? ..." యశ్వంత్ ఆవేశమంతా చల్లారి పోయింది.

జాన్ మళ్ళీ నవ్వాడు: "యూ పూర్ ఫెలో, అంత డబ్బుతో వాళ్ళెప్పుడో పారిపోయి వుంటారు!"

"నాన్సెన్స్ మాట్లాడకు!" అసహనంగా అరిచాడు

యశ్వంత్.

"లేకపోతే ఇంతవరకూ ఎందుకు రాలేదు? పారిపోయే వుండాలి—లేదా ఏదో జరిగివుంటుంది—దొరికిపోయి వుంటారు పోలీసులకి!"

అతని ముఖం చూసి గట్టిగా నవ్వాడు జాన్.

అప్పుడు పోలీస్ కమీషనర్, ఇన్‌స్పెక్టర్ కృష్ణన్, ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, కొందరు కానిస్టేబిల్స్‌తోపాటు డిటెక్టివ్ లాల్ కూడా గబగబా సమీపిస్తున్నారా బంగళాని, కాలినడకన ఆయుధాలతో.

"నో! అలా జరుగదు! అలా జరిగివుండదు!" యశ్వంత్ ఉద్రేకంగా అరిచి, వాచీ చూసుకున్నాడు. అతని ముఖం మరింత ఎర్రబడింది. కళ్ళు భయంకరంగా మెరిశాయి. జాన్‌ని చూసి అతని పళ్ళు బిగుసుకున్నాయి. "నువ్వు—జాన్—నువ్విప్పుడు చావబోతున్నావు! చంపడం మినహా నాకు దారిలేదు! నిన్ను అడ్డు తొలగించి వెళ్ళిపోతాను—ఆ బాస్టర్డ్స్ ఎక్కడున్నారో చూస్తాను! గాలిస్తాను! వెతికి పట్టుకుంటాను—నువ్వన్నదే జరిగి వుండొచ్చు. థాంక్స్! చచ్చే ముందు కళ్ళు తెరిపించావ్. చాలా థాంక్స్! మై ఫ్రెండ్...."

జాన్ అతన్ని చూసి కదలకుండా కూర్చున్నాడు, చేతులలాగే ఎత్తిపట్టుకొని. అతని కళ్ళు రివాల్వర్ మీదే వున్నాయి. అతను పెదవులు బిగబట్టాడు, ముంచుకొస్తున్న ప్రమాదానికి నుదురంతా చెమట పడుతోంది.

గేటు తీసుకుని వాళ్ళంతా లోపలకొచ్చేయసాగారు చీకట్లో నీడల్లా కదుల్తూ.

సుహాసిని గబగబా పైకొచ్చేసింది....

ఆమె అరిపాదాలు యే మాత్రం అలికిడి చేయలేదు.

యశ్వంత్ వెనుక నుంచి ఆమెను చూసి జాన్ అదిరి పడ్డాడు.

కింద వాళ్ళంతా హాల్లోకి ప్రవేశించారు.

యశ్వంత్ వికృతంగా నవ్వుతూ ట్రిగ్గర్ మీద వేలిని చుట్టి పట్టాడు: "మొదటిసారి జాన్! జీవితంలో మొదటి సారి నా చేతుల్తో ప్రాణాలు తీస్తున్నాను....అది నువ్వు కావడం....నువ్వు కావడం...."

సుహాసిని పై మెట్టువరకూ వచ్చి అక్కడాగిపోయింది. కింద పడివున్న రివాల్వర్ ని చూసింది. జాన్ చూస్తూండ గానే వెనుకనుంచి ఎవరో తరుముకొచ్చినట్టు గదిలోకి జొరబడింది, రివాల్వర్ అందుకొని.

జాన్ స్తబ్ధుడయ్యాడు.

యశ్వంత్ ట్రిగ్గర్ లాగబోయాడు.

వెనుక నుంచి అతని తల పెద్ద శబ్దంతో బ్రద్ద లయింది.

సుహాసిని మరోసారి ట్రిగ్గర్ లాగింది—అతని వీపులో రంధ్రం పడింది.

ఆమె ఆవేశంతో మళ్ళీ లాగింది—నడుములో రంధ్రం పడింది.

ఉద్రేకాతిరేకంతో మళ్ళీ లాగిందామె— మెడలోకి దూసుకెళ్ళింది బుల్లెట్.

కిందనుంచి వాళ్ళంతా అరుపులతో పైకొచ్చారు. "స్టాప్ దట్ షూటింగ్ స్వీటీ! యూ క్రేజీ! స్టాప్ దట్ షూటింగ్ స్వీటీ!"

ఆమె మళ్ళీ లాగింది ట్రిగ్గర్. కానీ ప్రేలలేదు. అతను కింద పడివున్నాడు అడవి దున్నలా, రక్తాన్ని పిచికారి కొడుతూ. అతని చేతిలో రివాల్వర్ అలాగే వుంది పట్టు విడకక. అతన్ని చూస్తోంది సుహాసిని తనివిదీరా. మొదటిసారి ఆమె కళ్ళు జీవం నింపుకున్నాయి. వాటిలో తృప్తి తన్మయత్వం కదలాడుతున్నాయి.

ఆమెను చేరుకున్న అధికారులు విస్తుపోయి చూస్తున్నారు.

—: సమాప్తం :—